క్లుప్తంగా

ఘనంగా శ్రావణ శుక్రవారం


ప్రత్యేక అలంకరణలో అష్టలక్ష్మి అమ్మవారు

దిల్‌సుఖ్‌నగర్: శ్రావణ మాసం తొలి శుక్రవారాన్ని మలక్‌పేటజోన్ పరిధిలో ఘనంగా జరుపుకున్నారు. ఆర్‌కేపురం శ్రీఅష్టలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఉదయం నుంచే అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని సంతోషిమాత ఆలయం, శ్రీదుర్గాదేవి ఆలయం, మలక్‌పేటలోని శ్రీఅండాళ్ నిలయం, మాదన్నపేటలోని దుర్గాదేవి ఆలయం, సైదాబాద్‌లోని శ్రీజయదుర్గా, శ్రీవిజయదుర్గాదేవి అమ్మవారి ఆలయం, ఐఎస్‌సదన్ తదితర ప్రాంతాలలోని అమ్మవారి ఆలయాలు, ఇళ్లలోను శ్రావణమాస ప్రత్యేక పూజలు జరుపుకున్నారు.

సైదాబాద్ కొత్త తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ


జయశ్రీకి శుభాకాంక్షలు తెలుపుతున్న డిప్యూటీ తహసీల్దార్

సైదాబాద్: సైదాబాద్ మండల తహసీల్దార్‌గా జయశ్రీ శుక్రవారం చంపాపేటలోని మండల కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న అనిత డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతిపై ఎండోమెంట్‌కు బదిలీ అయ్యారు. అంబర్‌పేట తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న జయశ్రీ బదిలీల్లో ఇక్కడికి వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన జయశ్రీని డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణరాజు, కార్యాలయ సిబ్బంది శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్

మలక్‌పేట: డివిజన్‌లోని దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం శాలివాహననగర్ స్ట్రీట్ నంబర్-3లో సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. అసంపూర్తి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అభివృద్ధి పనులు వేగవంతం చేయాలన్నారు. సదుపాయాలు మెరుగుపర్చడానికి తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాలనీల్లోని అంతర్గత రోడ్లను అందంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమలో జీహెచ్‌ఎంసీ సైట్ ఇంజినీర్ ఏడుకొండలు, వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్తిరెడ్డి, ఎస్‌ఎఫ్‌ఏ ముజీబ్, నాయకులు సంతోష్, నరేందర్‌రెడ్డి, మహేష్‌కుమార్, దినేష్, మల్లేష్ పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం

నాగోలు: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా 2023–2025 సంవత్సరాలకు మద్యం షాపులకు దరఖాస్తుల స్వీకరణ అనంతుల రాంరెడ్డి గార్డెన్‌లో జరుగుతోంది. శుక్రవారం చివరి రోజు కావడంతో దరఖాస్తుదారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో నాగోలు, బండ్లగూడ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. సరైన పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో వాహనాలను రోడ్లపై పార్కింగ్ చేయడంతో బండ్లగూడ –నాగోలు రోడ్డు ట్రాఫిక్‌తో నిండిపోయింది. కాగా, ఈనెల 21న ఉదయం 11 గంటలకు మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లక్కీ డ్రా ద్వారా దుకాణదారులను ఎంపిక చేస్తామని ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

నకిలీ గుట్కా తయారీ కేంద్రంపై దాడి: ఐదుగురి అరెస్టు

హయత్‌నగర్: నకిలీ గుట్కా తయారీ కేంద్రంపై హయత్‌నగర్ పోలీసులు శుక్రవారం దాడి చేసి ఐదుగురిని అరెస్ట్ చేసి 13 బస్తాల గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం...మెదక్ జిల్లా పుల్కల్‌కు చెందిన రహమాయత్, కమ్మం టౌన్‌కు చెందిన చిక్క సందీప్, ఉప్పుగూడ అంబికానగర్‌కు చెందిన ఠాకూర్ సంజీవ్‌సింగ్‌లు ముఠాగా ఏర్పడి పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధిలోని కళానగర్‌లో నకిలీ (నాసిరకం పొగాకుతో) గుట్కా తయారు కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. విశ్వసనీయ సమాచారంతో పోలీసులు సదరు కేంద్రంపై దాడి చేసి నిర్వాహకులతో పాటుగా అక్కడ పనిచేస్తున్న యూపీకి చెందిన సందీప్, కలులను అరెస్ట్ చేశారు. అంబర్ ఖైనీ బ్రాండ్‌కు చెందిన 13 బస్తాలు (బస్తా 100 ప్యాకెట్లు) స్వాధీనం చేసుకున్నారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలి


పారిశుద్ధ్య కార్మికుల ఆందోళనకు మద్దతు తెలుపుతున్న మల్‌రెడ్డి రాంరెడ్డి


మద్దతు తెలుపుతున్న కాంగ్రెస్ జీహెచ్‌ఎంసీ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి

- పర్మనెంట్ చేయాలని పారిశుద్ధ్య కార్మికుల ఆందోళన
- మద్దతు తెలిపిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు

ఎల్‌బీనగర్: ముఖ్యమంత్రి కేసీఆర్ గతంలో ఇచ్చిన హామీ మేరకు తమను పర్మనెంట్ చేయాలని జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య కార్మికులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి విధులు బహిష్కరించి ఎల్‌బీనగర్ మూడు సర్కిళ్ల కూడలిలో ఆందోళన బాట పట్టారు. కార్మికుల ఆందోళనకు బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, ఎల్‌బీనగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి, జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, వంగ మధుసూదన్ రెడ్డి, ఆకుల శ్రీవాణి, రాగుల వెంకటేశ్వరరెడ్డి, క్లాం నవజీవన్‌రెడ్డి, రంగా నర్సింహగుప్తా మద్దతు పలికారు. కార్మికుల డిమాండ్లు నెరవేరే వరకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీజేపీ నాయకులు మాట్లాడుతూ, బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేయడమే పనిగా పెట్టుకుందన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను బీఆర్‌ఎస్ అమలు పర్చకుండా, కొత్త హామీలు ప్రకటిస్తూ ప్రజలను మభ్యపెట్టి వచ్చే ఎన్నికల్లో ఓట్లు దండుకోవాలని చూస్తోందని ఆరోపించారు. ఉదయం 5 గంటకు విధులకు హాజరై నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్న పారిశుద్ధ్య కార్మికుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకుండాపోయిందని ఆరోపించారు.

నిలిచిన పారిశుద్ధ్య పనులు..

కార్మికులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆందోళన వల్ల ఎల్బీనగర్ మూడు సర్కిళ్లలో పారిశుద్ధ్య పనులు నిలిచిపోయాయి. పలు ప్రాంతాల్లో చెత్తను ఎత్తలేదు. రోడ్లు, ప్రభుత్వ కార్యాలయాలు శుభ్రం చేసేందుకు పారిశుద్ధ్య కార్మికులు ముందుకు రాలేదు.

బీఎస్పీ మద్దతు...

నాగోలు: జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని బహుజన సమాజ్ పార్టీ ఎల్‌బీనగర్ అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు గువ్వల సాయి రామకృష్ణ ముదిరాజ్ డిమాండ్ చేశారు. నాగోలు డివిజన్ జైపురికాలనీలో జీహెచ్‌ఎంసీ కార్మికులు నిర్వహించిన ర్యాలీలో పాల్గొని మద్దతు తెలిపారు. బీఎస్పీ నియోజకవర్గ జనరల్ సెక్రెటరీ వేముగంటి సంపత్, ఇన్‌చార్జి జక్క యాదగిరి. మహిళా కన్వీనర్ మాధవి, హస్తినాపురం అధ్యక్షుడు నర్సింగ్, అనిల్ యాదవ్ పాల్గొన్నారు.

రైతుబజారు చౌరస్తాలో నిత్యం ట్రా‘ఫికర్’

- రాకపోకలకు వాహనదారుల ఇక్కట్లు
- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు


వనస్థలిపురం రైతుబజార్ చౌరస్తాలో ట్రాఫిక్‌జామ్

వనస్థలిపురం: వనస్థలిపురం రైతుబజారు చౌరస్తాలో తరచూ ట్రాఫిక్‌జామ్‌లతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వనస్థలిపురం గణేష్ టెంపుల్, సుష్మా చౌరస్తా, సాహెబ్‌నగర్, హయత్‌నగర్ ఇలా... నలువైపుల నుంచి నిత్యం వేలాదిగా వాహనాలు ఈ కూడలి మీదుగా వెళ్తుంటాయి. అయితే ఈ చౌరస్తాలో ట్రాఫిక్ నియంత్రణకు సరైన వ్యవస్థ లేకపోవడంతో నాలుగువైపుల నుంచి వాహనాలు జిగ్‌జాగ్‌గా వస్తుండటంతో తీవ్ర ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. అప్పుడప్పుడు ఒక ట్రాఫిక్ కానిస్టేబుల్ ఉంటున్నా, పూర్తిస్థాయిలో ట్రాఫిక్ నియంత్రణకు సరైన వ్యవస్థ లేదు. ఇప్పటికైనా ట్రాఫిక్ అధికారులు స్పందించి కూడలిలో ట్రాఫిక్ నియంత్రణకు సరైన చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

రేషన్ పంపిణీలో సమయపాలన పాటించాలి


రేషన్ షాపులో సోషల్ ఆడిట్ చేస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ

సైదాబాద్: రేషన్ షాపుల్లో నిత్యావసరాల పంపిణీలో తప్పనిసరిగా సమయపాలన పాటించాలని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్ రెడ్డి రేషన్ డీలర్లకు సూచించారు. శుక్రవారం కార్పొరేటర్ సివిల్ సప్లయ్ అధికారులతో కలిసి సైదాబాద్ డివిజన్‌లోని పలు రేషన్‌షాపుల్లో సోషల్ ఆడిటింగ్ చేశారు. షాపుల్లో ఉన్న నిల్వల వివరాలను కార్పొరేటర్ తనిఖీ చేశారు. షాపుల వద్దకు వచ్చిన మహిళలతో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ అధికారులు రాజశేఖర్, కవిత, జ్యోతి, బాలకృష్ణ, మీనాకుమారి, భరత్ పాల్గొన్నారు.

2వ ఏఎన్ఎంల ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలి


అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

హయత్‌నగర్: గత 16 ఏళ్లుగా వైద్య సేవలందిస్తున్న 2వ ఏఎన్ఎంల ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా సబ్‌కమిటీ సభ్యులు సామిడి శేఖర్‌రెడ్డి అన్నారు. 2వ ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ వద్ద చేపట్టిన ఆందోళనకు మద్దతుగా హయత్‌నగర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ... కరోనా కాలంలో తమ కుటుంబాలను వదిలేసి ప్రజలకు సేవలందించిన 2వ ఏఎన్ఎంలకు ప్రభుత్వం తగిన న్యాయం చేయాలన్నారు. ఇన్నేళ్లుగా పనిచేస్తున్న వారి సర్వీసులను పరిగణలోకి తీసుకోకుండా కొత్త నియామకాల కోసం నోటిఫికేషన్ వేయడం తగదని వెంటనే నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకోవాలన్నారు. హయత్‌నగర్ మండల ఏఐటీయూసీ కార్యదర్శి రమావత్ సక్రూ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ఏఐవైఎఫ్ పోలోజు లక్ష్మణాచారి, మండల మహిళా సమాఖ్య నాయకులు సరిత, సుభద్ర, నాయకులు శ్రీను, కృష్ణ, జాని, విమల, సుజాత, అరుణ, కల్యాణి, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ‘డబుల్’ ఇళ్లు కేటాయించాలి: సామ


మన్సూరాబాద్: అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించాలని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి డిమాండ్ చేశారు. ‘డబుల్’ ఇళ్ల నిర్మాణంలో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ బీజేపీ రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు ఎల్‌బీనగర్‌లోని జాతీయ రహదారిపై పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి రంగారెడ్డి శుక్రవారం రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత తొమ్మిదిన్నరేళ్లుగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం రెండు పడకల ఇళ్లు ఇస్తామని పేదలను మోసం చేస్తోందని మండిపడ్డారు. ఇళ్ల కోసం వేలల్లో దరఖాస్తులు వస్తే.. వందల్లో మాత్రమే నిర్మించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్మించిన ఇళ్లలో కూడా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తన అనుచరులకు, బీఆర్‌ఎస్ కార్యకర్తలకు కట్టబెట్టారని ఆరోపించారు. లక్ష రూపాయల ఆర్థిక సాయం బీసీల్లోని అన్ని కులాలకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమీపిస్తుండటంతో..డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లపై రివ్యూల పేరుతో మరో నాటకానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం తెరలేపిందని రంగారెడ్డి విమర్శించారు. రాస్తారోకో చేస్తున్న రంగారెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ క్లాం నవజీవన్‌రెడ్డి, నాయకులు కొత్త రవీందర్‌గౌడ్, విజయ్‌కుమార్, శ్యామల, కృష్ణవేణి, సామ ప్రభాకర్‌రెడ్డి, అంజన్‌కుమార్‌గౌడ్, రాకేష్‌యాదవ్, కవితారెడ్డి పాల్గొన్నారు.


భాగ్యనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో...

మలక్‌పేట: డబుల్ ఇళ్ల కేటాయింపు, దళిత బంధు మంజూరులో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని పేర్కొంటూ బీజేపీ భాగ్యనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మూసారంబాగ్ చౌరస్తాలో నిరసన తెలిపారు. భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్‌రెడ్డి, కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి, అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, గౌర దేవేందర్, రమేష్‌రెడ్డి, లింగాల హరిగౌడ్, సురేందర్, నవీన్, అంబ బాయి, ఉదయ్ పాల్గొన్నారు.

సైదాబాద్‌లో రాస్తారోకో

సైదాబాద్: పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ సైదాబాద్ ప్రధాన రహదారిపై బీజేపీ నాయకులు రాస్తారోకో చేశారు.రహదారికి ఇరువైపులా భారీగా ట్రాఫిక్‌జామ్ అయ్యింది. దీంతో బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, సహదేవ్‌యాదవ్, ఐఎస్‌సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతారెడ్డి, పార్టీ అధికార ప్రతినిధి వీరేంద్రబాబులను పోలీసులు అరెస్టు చేసి సైదాబాద్, మాదన్నపేట పీఎస్‌లకు తరలించారు.


ఎల్‌బీనగర్‌లోని జాతీయ రహదారిపై బైఠాయించిన అధ్యక్షుడు సామ రంగారెడ్డి తదితరులు


మూసారంబాగ్‌లో నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

బాలికతో వెకిలి చేష్టలు... నిందితుడికి ఐదేళ్ల జైలు

రంగారెడ్డి కోర్టులు: బాలికతో వెకిలిగా ప్రవర్తించిన వ్యక్తికి శుక్రవారం ఎల్బీనగర్‌లోని 9వ అదనపు జిల్లా కోర్టు ఐదేళ్ల శిక్షతోపాటు రూ.10 వేల జరిమానా విధించింది. మీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో 2017లో నమోదైన ఈ కేసు సంబంధించి ఏపీపీ సునీత బర్ల తెలిపిన వివరాల ప్రకారం... నిందితుడు గుంటి రాజు కూలీ పని చేసుకుంటూ మీర్‌పేట రైతు బజార్ సమీపంలో జీవించేవాడు. బాలిక తల్లిదండ్రులు కూడా కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. రోజు మాదిరిగానే తల్లిదండ్రులు బాలికను స్కూల్ వద్ద విడిచి కూలీ పనులకు వెళ్లారు. స్కూల్ ముగిశాక బాలిక ఇంటికి చేరుకుని, ఇంటి ముందు ఆడుకుంటుండగా గుంటి రాజు బాలికను గుడిసెలోకి ఎత్తుకెళ్లి వెకిలి చేష్టలకు పాల్పడ్డాడు. అదే ప్రాంతానికి చెందిన కృష్ణయ్య నిందితుడిని పట్టుకుని, విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు తెలియజేశాడు. ఈ విషయంపై మీర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసిన నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన న్యాయస్థానం నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్షతోపాటు జరిమానా విధించింది.

చెట్లను నరికిన వారిపై చర్యలు తీసుకోవాలి

హస్తినాపురం: పర్యారణ పరిరక్షణ కోసం పెంచి పెద్దచేసిన చెట్లను కొందరు నిర్దాక్షిణ్యంగా నరికివేస్తున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యాడని, టీచర్స్ కాలనీ చెట్లపరిరక్షణ కమిటీ కోఆర్డినేటర్ వి.సన్నీ హెరాక్లియస్ డిమాండ్ అన్నారు. చెట్లను నరికిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని శుక్రవారం రంగారెడ్డి జిల్లా మంఖాల్ ఫారెస్ట్ రేంజ్ అధికారికి ఫిర్యాదు చేశానని తెలిపారు. నాగార్జున సాగర్ రహదారిపై అనుపమానగర్ కాలనీ ఆవరణలో ఏర్పాటు చేసిన చెట్లను ఎవరు పడితే వారు నరికివేస్తున్నా అటవీ శాఖ అధికారులు పట్టించుకోవడంలేదని, ఉన్నతాధికారులు స్పందించి చెట్లను నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని స్నసీ హెరాక్లియస్ తన ఫిర్యాదులో పేర్కొన్నాడు.

అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలి


అగ్రికల్చర్ కాలనీలో రోడ్డు పనులను పరిశీలిస్తున్న సుజాతానాయక్

హస్తినాపురం: డివిజన్‌లోని వివిధ కాలనీల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలని, అప్పుడే పనులు నాణ్యతతో త్వరగా పూర్తయ్యేందుకు అవకాశం ఉందని హస్తినాపురం కార్పొరేటర్ సుజాతానాయక్ అన్నారు. శుక్రవారం ఆమె డివిజన్‌లోని అగ్రికల్చర్ కాలనీలో రూ. 1.02 కోట్లతో చేపట్టనున్న బీటీ రోడ్డు పనులను ఏఈ హేమూనాయక్‌తో కలిసి పరిశీలించారు. కాలనీ అధ్యక్షుడు మణిపాల్‌రెడ్డి, పీఎస్ఆర్ శర్మ, బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

వెరిఫికేషన్ ఉద్యోగిపై ఫిర్యాదు

చాదర్‌ఘాట్: అజంపురా వార్డ్ ఆఫీస్‌లో పని చేస్తున్న వెరిఫికేషన్ ఉద్యోగి ఓంసింగ్‌పై చర్యలు తీసుకోవాలని గ్రేటర్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బాబు శ్రీనివాస్ జీహెచ్‌ఎంసీ అధికారులను కోరాడు. ఈ మేరకు ఆయన శుక్రవారం మలక్‌పేట సర్కిల్-6 డీసీ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా బాబు శ్రీనివాస్ మాట్లాడుతూ, జనన, మరణ సర్టిఫికెట్ల కోసం ఓంసింగ్ నిరుపేదల నుంచి బలవంతంగా డబ్బులు వసూలు చేస్తున్నాడన్నారు. ఆఫీస్‌లో అందుబాటులో ఉండకుండా బయట సెటిల్‌మెంట్లు చేస్తున్నాడని ఆరోపించారు. అతనిపై తగిన చర్యలు తీసుకొని పేదలకు న్యాయం చేయాలని ఆయన అధికారులను కోరాడు.

సర్దార్ పాపన్నగౌడ్‌కు ఘన నివాళి

మన్సూరాబాద్: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని శుక్రవారం ఎల్‌బీనగర్‌లో ఘనంగా నిర్వహించారు. మన్సూరాబాద్ డివిజన్ చింతలకుంటలోని ప్రలవి గార్డెన్స్‌లో జరిగిన వేడుకల్లో ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి హాజరై పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర పాపన్నగౌడ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంబాల మల్లేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్‌లో జరిగిన వేడుకల్లో జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్‌లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, బీఆర్ఎస్ ఇన్‌చార్జి ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్నగౌడ్ హాజరై పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

లింగోజిగూడ: సరూర్‌నగర్ గౌడ సంఘం భవనంలో పాపన్న గౌడ్ జయంతిని నిర్వహించారు. సరూర్‌నగర్ గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర గీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్, మాల సంఘాల ఐక్య వేదిక అధ్యక్షుడు బేర బాలకిషన్, చంపాపేట కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి పాల్గొని పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దయానంద్ స్వామి, కందికంటి శ్రీధర్‌గౌడ్, బాల్‌రాజ్, ఆనంద్, కొండల్, ప్రవీణ్, శ్రీధర్, శ్రీనివాస్, శ్రీకాంత్, యాదయ్య, సుభాష్ పాల్గొన్నారు.

◆ కొత్తపేట గ్రామంలో పాపన్నగౌడ్ యువజన సంఘం ఆధ్వర్యంలో శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు యష్పాల్ గౌడ్, కాటదాసుగౌడ్, అశోక్‌గౌడ్, భాస్కర్‌గౌడ్, సత్యనారాయణ, రాజేందర్, నర్సింగ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

◆ హస్తినాపురం డివిజన్‌లో భూపేశ్‌గుప్తానగర్, నందనవనంలో జవ్వగాని రాజుగౌడ్, మల్లేష్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్, మాజీ కార్పొరేటర్ లక్ష్మీప్రసన్నగౌడ్ పాల్గొని పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళులర్పించారు. నాయకులు శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, సతీష్‌గౌడ్, మల్లేష్‌గౌడ్, కృష్ణగౌడ్ పాల్గొన్నారు.


ప్రలవి గార్డెన్స్‌లో పాపన్నగౌడ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


సరూర్‌నగర్ గౌడ సంఘం భవనం వద్ద.. నివాళులర్పిస్తున్న పల్లె రవికుమార్‌గౌడ్

బాధితురాలికి న్యాయం చేయాలి: మధుయాష్కి


బాధితురాలిని పరామర్శిస్తున్న మధుయాష్కి, మల్‌రెడ్డి రాంరెడ్డి, బెల్లయ్య నాయక్ తదితరులు

చైతన్యపురి: ఎల్‌బీనగర్ పోలీసుల చేతిలో గాయపడ్డ గిరిజన మహిళ వడిత్య లక్ష్మికి ప్రభుత్వ మెరుగైన వైద్యం అందించాలని, సమగ్ర విచారణ చేపట్టి బాధితురాలికి న్యాయం చేయాలని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి డిమాండ్ చేశారు. ఎల్‌బీనగర్ కాంగ్రెస్ పార్టీ కో–ఆర్డినేటర్ మల్‌రెడ్డి రాంరెడ్డి, కాంగ్రెస్ ఆదివాసీ జాతీయ ఉపాధ్యక్షుడు బెల్లయ్య నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు భరత్ చౌహాన్‌లతో కలిసి శుక్రవారం సాయంత్రం కర్మన్‌ఘాట్‌లోని జీవన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మిని పరామర్శించారు. అనంతరం చైతన్యపురిలోని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మధుయాష్కి మీడియాతో మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన రోజున ఎల్‌బీనగర్ పోలీసులు గిరిజన మహిళలను అర్ధరాత్రి తీసుకెళ్లి విచక్షణారహితంగా కొట్టారన్నారు. కూతురు వివాహం కోసం తెచ్చుకున్న రూ.3 లక్షలను, చెవి కమ్మలను లాక్కున్నట్లు తెలిసిందన్నారు. ఈ ఘనటలో ఎల్‌బీనగర్ ఇన్‌స్పెక్టర్, ఎస్ఐను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇంత జరిగినా స్థానిక ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కానీ, మంత్రి సబితారెడ్డి కానీ బాధితురాలిని పరామర్శించలేదని మధుయాష్కి విమర్శించారు. బాధితురాలికి ప్రభుత్వం రూ.25 లక్షల నష్టపరిహారం చెల్లించాలని, డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కేటాయించాలని, బాధితురాలి కూతురికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పీసీసీ కార్యదర్శి కోట్ల శ్రీనివాస్, నాయకులు ధన్‌రాజ్‌గౌడ్, షరీఫ్, డీప్లా నాయక్, రణధీర్‌రెడ్డి, మంజులారెడ్డి, లింగాల కిషోర్‌గౌడ్, రమేష్ నాయక్ పాల్గొన్నారు.

‘పోలీసులను విధుల నుంచి తొలగించాలి’

చంపాపేట: గిరిజన మహిళ లక్ష్మిపై అకారణంగా, అమానుషంగా దాడికి పాల్పడిన పోలీసులను విధుల నుంచి తొలగించి వారిపై అట్రాసిటీ కేసును నమోదు చేయాలని రాష్ట్ర సీపీఐ పార్టీ కార్యదర్శి ఈటీ నర్సింహ డిమాండ్ చేశారు. కర్మన్‌ఘాట్‌లోని జీవన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మి శుక్రవారం రాత్రి ఆయన సేవాలాల్ బంజారా సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు కొర్ర మోతీలాల్ నాయక్, మహిళా విభాగ రాష్ట్ర అధ్యక్షురాలు సక్రిబాయి, సీపీఐ పార్టీ గ్రేటర్ కార్యదర్శి ఛాయాదేవిలతో కలి సి ఆమె ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

సర్వీస్ నుంచి డిస్మిస్ చేయాలి

నాగోలు: లక్ష్మిపై దాడి చేసి చిత్రహింసలు పెట్టిన ఎస్ఐ, ఇతర పోలీసులను వెంటనే సర్వీస్ నుంచి డిస్మిస్ చేయాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ప్రచార కమిటీ సభ్యుడు కార్తీక్ మహారాజ్ డిమాండ్ చేశారు. గిరిజన మహిళలను పోలీసులను తీవ్రంగా కొట్టినందుకు శుక్రవారం ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. సంఘం నాయకులు రాజ్‌కమల్, లింగస్వామి, గణేష్, సైదబాబు, రాజీవ్, సైదులు, రవి, మహేష్ పాల్గొన్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలి: బీఎస్పీ

నాగోలు: గిరిజన మహిళ లక్ష్మిని అకారణంగా అరెస్టు చేసి, ఎల్బీనగర్ పోలీసు స్టేషన్‌లో చావు దెబ్బలు కొట్టి హాస్పిటల్ పాల్జేసిన పోలీసులందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీఎస్పీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి జక్క యాదగిరి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఎల్‌బీనగర్ ఠాణాలో బీఎస్పీ నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. మహిళపై దాడి చేసిన హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేసి ఎస్సైను ఎందుకు వదిలేశారని ఆయన ప్రశ్నించారు.



చికిత్స పొందుతూ రోగి మృతి

వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆసుపత్రి వద్ద బంధువుల ఆందోళన

మన్సూరాబాద్: వైద్యుల నిర్లక్ష్యంతో రోగి మృతి చెందిందని ఆరోపిస్తూ బంధువులు ఆందోళన చేపట్టిన ఘటన ఎల్బీనగర్‌లోని కామినేని హాస్పిటల్స్ వద్ద శుక్రవారం జరిగింది. మృతురాలి బంధువుల కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం బానాల గ్రామానికి చెందిన అలివేలు (55) గుండెనొప్పితో ఎల్‌బీనగర్‌లోని కామినేని హాస్పిటల్స్‌లో చేరింది. పరీక్షించిన వైద్యులు శస్త్రచికిత్స చేయాలని తెలిపారు. ఆసుపత్రి వర్గాల సూచన మేరకు ఆరోగ్యశ్రీ పథకం కింద చికిత్స చేయించుకొనేందు ఆరోగ్యశ్రీకి దరఖాస్తు చేశారు. ఈనెల 16న ఆరోగ్యశ్రీ నుంచి శస్త్రచికిత్సకు అనుమతి లభించింది. వారం రోజుల పాటు శస్త్రచికిత్స చేయకపోవడంతో గురువారం రాత్రి అలివేలు మృతి చెందింది. ఆరోగ్యశ్రీ అనుమతి ఆలస్యం కావడానికి ఆసుపత్రి వర్గాల నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ రోగి బంధువులు హాస్పిటల్ ఎదుట ఆందోళనకు దిగారు. ఎల్‌బీనగర్ పోలీసులు వచ్చి బందోబస్తు చేపట్టారు.

ఆరోగ్యశ్రీ అనుమతి రావడం ఆలస్యమైంది

ఆరోగ్యశ్రీ నుంచి శస్త్రచికిత్సకు అనుమతి రావటంలో ఆలస్యం జరిగిందని, ఇందులో ఆసుపత్రి యాజమాన్యం లేదా వైద్యుల నిర్లక్ష్యం లేదని కామినేని హాస్పిటల్ వర్గాలు వివరణ ఇచ్చాయి. 16న అప్రూవల్ వచ్చిందని, శనివారం శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించామని, దురదృష్టవశాత్తు రోగి మృతి చెందిందని తెలిపారు.